## ప్రజల చెంతకే పాలన.. ప్రగతికి కొత్త బాటలు

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నేతల వెల్లడి
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ పదవిలో ఎందుకు?
- డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి** : తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ రాష్ట్ర

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 3 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 8




2 లో..

# ఫిర్యాదు ఏడుగురిపై.. దర్యాప్తులో 27 మంది!

- బాధ్యతాయుతమైన పోలీసింగ్‌కు ఇదో నిదర్శనం!
- ఫిర్యాదుకే పరిమితం కాకుండా కేసు పరిధిని విస్తరించిన పోలీసులు
- శివ హత్య కేసులో 23 మంది అరెస్ట్.. మరో నలుగురి కోసం గాలింపు
- ఘటన వెనుక ప్రతి ఒక్కరి పాత్రపై లోతుగా దర్యాప్తు
- ఫిర్యాదులో పేరు లేదని వదల్లేదు.. ఆధారాలుంటే కేసులో చేర్చారు
- మణుగూరు పోలీసుల దర్యాప్తు తీరుపై జిల్లాలో ప్రశంసలు

# శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం



**అసెంబ్లీలో ఘటనను ప్రస్తావిస్తా: కేటీఆర్..**

**కుటుంబానికి రూ.50 వేల సాయం...**

**ములకలపల్లి సెప్టెంబర్02 (ప్రజాజ్యోతి):** అత్యాచారానికి గురై హత్యకు గురైన ఉకే శిరీషా కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. కేటీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం చౌటిగూడెంలోని శిరీషా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శిరీషా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ రవిచంద్ర కేటీఆర్‌కు ఫోన్ చేసి శిరీషా తల్లి రామలక్ష్మి, సోదరుడు శివరాంలతో మాట్లాడించారు. నిందితుడిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం

మిగతా 2 లో...

## కారు డిక్కీలో 20 లక్షల 'మత్తు' గుట్టు రట్టు!




4 లో...

- భార్యాభర్తల గంజాయి దందా బస్ట్.. అశ్వాపురం లో భారీ పట్టివేత...
- అశ్వాపురం పోలీసుల సూపర్ స్ట్రైక్..40 కిలోల గంజాయి సీజ్...
- టాటా నెక్సాన్ లో గంజాయి..దంపతులు అరెస్ట్.
- ఒడిశా నుండి షిర్డీకి..దారి మధ్యలో అడ్డంగా బుక్కయిన గంజాయి స్మగ్లర్లు.!



# బాధ్యతాయుతమైన వైద్యులు

2 లో..

- విషాద వేళ.. 12 గంటల పాటు నిర్విరామ వైద్య సేవలు
- 50 మందికి పైగా చిన్నారులకు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అత్యవసర చికిత్స
- వైద్యులను ఏకం చేసిన డీసీహెచ్ఎస్ రవిబాబు.. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రశంసలు

## ప్రజల చెంతకే పాలన.. ప్రగతికి కొత్త బాటలు

(మొదటి పేజీ తరువాయి...)

నాయకులు ఆళ్ల మురళి, టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లడంతో రాష్ట్రంలో అభివృద్ధికి సరికొత్త బాటలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా తిప్పికొట్టారు. ప్రజలను వంచించి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన గత బీఆర్ఎస్ పాలనను ప్రజలు మరిచిపోలేదని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ సదుపాయాలు, జీతభత్యాలు పొందుతూ ప్రజలకు అందుబాటులో ఉండని కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి, ప్రతిపక్ష నేత హోదాకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న సుపరిపాలన, ప్రజాదరణను చూసి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని, అందుకే ప్రభుత్వంపై పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణను ప్రగతి బాటలోకి తీసుకెళ్తోందని తోట దేవి ప్రసన్న అన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం, రైతు భరోసా నిధులు అందించడం, ఉచిత విద్యుత్ సరఫరా, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల మంజూరు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉద్యోగ, వైద్య, ఆరోగ్య రంగాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వైపే ఉన్నారని, భవిష్యత్తులోనూ ఇందిరమ్మ పాలననే కోరుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితాకుమారి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. పెద్దబాబు, జిల్లా కోశాధికారి కొరుమూరు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మంద హనుమంతు, జానీ పాషా, ఐఎన్‌టీయూసీ కార్పొరేట్, ఏరియా వైస్ ప్రెసిడెంట్లు పీతాంబరం, ఎండీ రజాక్, పూనెం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, కార్పొరేటర్లు కేకే శ్రీనివాస్, దావూద్, దంతేపోయిన నరేష్, జల్లి శ్రీలక్ష్మి, భవిత, విజయలక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అనిల్, బాల ప్రసాద్ పాసి, కనకం సూరిబాబు, మండల శ్రీనివాస్, అక్బర్, పోస్ట్ ఆఫీస్ వాసు, సమ్మయ్య, వీరయ్య, మధు, రమేష్, బోయినపల్లి రాము, ఉబ్బన రాజు తదితరులు పాల్గొన్నారు.

## శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం





(మొదటి పేజీ తరువాయి...)

చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. స్పందించిన కేటీఆర్.. ఘటనను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శిరీషా తల్లి రామలక్ష్మికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, కాపు సీతామహాలక్ష్మి, సింధూ తపస్వి, ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, మోరంపూడి అప్పారావు, పుష్పాల చందర్‌రావు, మేకల వెంకటేశ్వరరావు, కొండవీటి రాజారావు, మేకల రాజేష్, గ్రామ సర్పంచ్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతమైన వైద్యులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి :**
ఆపద సమయంలో విధుల సమయం కంటే రోగి ప్రాణానికే ప్రాధాన్యం ఇచ్చారు భద్రాద్రి జిల్లా వైద్య బృందం. ఒకేసారి 50 మందికి పైగా చిన్నారులు అస్వస్థతకు గురై భద్రాచలం ఏరియా ఆస్పత్రికి చేరుకున్న వేళ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తమై చికిత్సకు సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమైన అత్యవసర వైద్య ప్రక్రియలు మంగళవారం తెల్లవారుజాము 3 గంటల వరకు కొనసాగాయి. పరిధి ఏ రాష్ట్రానిది అని చూడకుండా పరిస్థితి తీవ్రతను గుర్తించి.. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు కూడా భద్రాచలానికి చేరుకుని బాధితుల చికిత్సలో పాలు పంచుకున్నారు.

### గొల్లగుప్పలో విషాదం

ఈ ఘటనకు కేంద్రంగా నిలిచింది ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామం. మలేరియా నివారణ చర్యల్లో భాగంగా అక్కడ క్లోరోక్విన్ మాత్రలు పంపిణీ చేసిన అనంతరం పలువురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఏడేళ్ల బాలిక మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మరోవైపు పెద్ద సంఖ్యలో చిన్నారులు అనారోగ్యానికి గురికావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. ఒకేసారి ఇంత మంది బాధితులు ఆస్పత్రికి రావడంతో అదనపు వైద్య బృందం అవసరమైంది. అప్పటికే అందుబాటులో ఉన్న సిబ్బంది చికిత్స ప్రారంభించగా, పరిస్థితిని మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులను కూడా రంగంలోకి దించారు.

### అర్ధరాత్రి దాటినా ఆగని సేవలు

సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి మొదలైన వైద్య ప్రక్రియలు మంగళవారం తెల్లవారుజాము 3 గంటల వరకు కొనసాగాయి. ఈ సమయంలో బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందించారు. రాత్రి సమయం అయినప్పటికీ సిబ్బంది వెనక్కి తగ్గకుండా పరిస్థితికి అనుగుణంగా విధులు నిర్వహించారు. దీంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో రోగులు వచ్చినప్పుడు విభాగాల మధ్య సమన్వయం ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది పరస్పర సహకారంతో పనిచేయడంతో అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఆస్పత్రి వ్యవస్థ ఎప్పటికి సిద్ధంగా ఉంటుందని ఈ సంఘటన రుజువు చేసింది.

### వైద్యులను సమన్వయం చేసిన రవిబాబు.. మంత్రి ప్రశంసలు

ఈ అత్యవసర పరిస్థితిలో డీసీహెచ్ఎస్ రవిబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులను అప్రమత్తం చేసి, పరిస్థితి తీవ్రతను వివరించి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి చేరుకునేలా సమన్వయం చేశారు. ఆస్పత్రిలో చికిత్సకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, వివిధ విభాగాల మధ్య సమన్వయంతో బాధితులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. ఆయన చొరవతో ఒకే చోటకు చేరిన వైద్యులు తమ సాధారణ విధులను పక్కనపెట్టి చిన్నారుల చికిత్సకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సమష్టికృషిని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ ఎక్స్ వేదికగా అభినందించారు. సంక్షోభ సమయంలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది హోదాలు, పోస్టింగ్‌లకు అతీతంగా ఒకే బృందంగా పనిచేసిన తీరును ప్రశంసించారు. మరోవైపు రవిబాబు కూడా వైద్య బృందం అంకితభావాన్ని అభినందిస్తూ, అత్యవసర వేళ రోగుల కోసం సమష్టిగా నిలబడటమే నిజమైన వైద్య సేవల స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఘటనలో రవిబాబు సమన్వయం, వైద్య సిబ్బంది అంకితభావం కలిసి అత్యవసర పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేలా చేశాయి.

# ఫిర్యాదు ఏడుగురిపై.. దర్యాప్తులో 27 మంది!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 02, ప్రజాజ్యోతి:** నేరం జరగగానే బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదులోని పేర్లతోనే ప్రాథమిక ఎఫ్ ఐఆర్ చెయ్యడం, అవసరమైతే కొన్ని ఒత్తడుల వల్ల ఉన్న పేర్లనే తప్పియడం సాధారణంగా కొన్ని కేసులలో చూస్తుంటాం. కానీ, అలంటి ఒత్తిళ్లను పక్కనపెట్టి, ఫిర్యాదు దాటి నేరం వెనుక ఉన్న మూలాలను తోడటమే నిజమైన బాధ్యతాయుతమైన పోలీసింగ్ కు నిదర్శనం. ఇటీవల మణుగూరులో జరిగిన సింహాద్రి శివ దారుణ హత్య కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులు అనుసరించిన తీరు ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

### వివాదం అలా.. విచారణ ఇలా..

బాధిత సతీష్, ఈర్ల లోకేష్ వర్గాల మధ్య ఏర్పడిన వ్యక్తిగత కక్షలు స్థానిక గ్యాంగ్ వివాదంగా మారాయి. సతీష్ కు మద్దతుగా నిలిచిన శివపై కక్ష పెంచుకున్న ప్రత్యర్థులు, ఆగస్టు 27న అతడు నేతాజీ గ్రౌండ్ కు రాగానే మూకుమ్మడిగా దాడి చేసి చంపేశారు. తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఏడుగురి పేర్లను మాత్రమే పేర్కొన్నారు. ఆ ఏడుగురి పరిధికే దర్యాప్తును ముగించే వెసులుబాటు ఉన్నప్పటికీ, మణుగూరు పోలీసులు శాస్త్రీయ విచారణ బాట పట్టారు. దర్యాప్తులో ప్రదానంగా కాల్ డేటా, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, డిజిటల్ ఆధారాలను విశ్లేషించిన పోలీసులు.. ఫిర్యాదులో పేరు లేదనే కారణంతో ఏ ఒక్క ప్రమేయమున్న వ్యక్తినీ వదిలిపెట్టలేదు. ఫిర్యాదులోని ఏడుగురితో పాటు దర్యాప్తులో తేలిన మరికొందరి పాత్ర ఆధారంగా మొత్తం 27 మందిని నిందితులుగా కేసులో చేర్చారు. వారిలో ఇప్పటికే 23 మందిని అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. దీంతో బాధితులలు తమకు కనిపించిన, అనుమానించిన పేర్లను నమోదు చేయడం ప్రాథమిక విధి కాగా, బాధితుడు చూడలేని లేదా వెనుక ఉండి నడిపించిన కుట్రదారులను ఆధారాలతో సహా విచారణ పరిధిలోకి తేవడమే అసలైన బాధ్యత అని పోలీసుల భాద్యత అని నిరూపించారు.

### విమర్శల అడ్డుగోడలను దాటి..

సాదారణంగా పలుకుబడి ఉందనో, రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనో పోలీసులు ప్రాథమిక ఫిర్యాదుకే పరిమితమై అసలు సూత్రధారులను తప్పిస్తుంటారు అనే విమర్శ సమాజంలో తరచూ వినిపిస్తుంటుంది. కానీ, ఈ కేసులో పోలీసులు అనుసరించిన శైలి ఆ అపనమ్మకాలను పటాపంచలు చేసింది. బాధిత కుటుంబం ఏడుగురి పేర్లే చెప్పినప్పటికీ.. ఫిర్యాదులో పేరు లేదు కాబట్టి తమకేం సంబంధం లేదన్నట్లు పోలీసులు చేతులు దులుపుకోలేదు. బాహ్య ప్రభావాలకు లొంగకుండా క్షేత్రస్థాయి సాక్ష్యాల ప్రాతిపదికగా తెరవెనుక ఉన్న మరో 20 మంది పాత్రను నిష్పాక్షికంగా వెలికితీశారు. దీంతో ఫిర్యాదు అనేది దర్యాప్తునకు ఒక ఆరంభం మాత్రమే తప్ప అదే ముగింపు కాదు అనే ప్రాథమిక సూత్రాన్ని మణుగూరు పోలీసులు ఆచరణలో చూపి నిరూపించారు. దీంతో నేరం చేస్తే చట్టం ముందు ఎవరైనా ఒకటేననే సంకేతాన్ని పంపుతూ సమాజంలో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేలా ఈ విచారణను సాగిస్తున్నారు. రాష్ట్రాన్నే కుదిపేసిన ఈ కేసు లో మణుగూరు పోలీసులు వ్యవహరించిన ఈ తిరునుచుసి ఇదే కదా నిజమైన పోలిసింగ్ అంటూ ప్రజల చేత ప్రశంసలు అందుకుంటున్నారు.

### ‘అందరూ గ్యాంగ్ స్టర్లు కాదు.. సోషల్ మీడియా ప్రచారాల్లో నిజం లేదు’

ఈ కేసులో 27 మంది నిందితులు అనగానే.. అందరినీ ఒకే గాటన కడుతూ సోషల్ మీడియా వేదికగా రకరకాల ప్రచారాలు షికారు చేశాయి. వీరంతా గంజాయి కింగ్ పిన్లు అని, నిరంతరం నేరాలకు పాల్పడే గ్యాంగ్ స్టర్లు అంటూ వార్తలు వైరల్ అయ్యాయి. అయితే, ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఓ ఉన్నతాధికారి ‘ప్రజాజ్యోతి’కి స్పష్టం చేశారు. నిందితుల్లో నలుగురు నుంచి ఏడుగురు మాత్రమే గంజాయి అలవాటు, ఇతర అల్లరి మూక కార్యకలాపాలు కలిగిన వ్యక్తులు కాగా.. మిగిలిన సుమారు 20 మంది సాధారణ నేపథ్యం ఉన్నవారేనని తెలిపారు. వివిధ వ్యాపారాలు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ, ఉన్నత చదువులు చదువుకుంటూ తమ పనుల్లో నిమగ్నమయ్యే యువత వీరంతా! కానీ, ఒక గ్రూప్ గా ఏర్పడటం, క్షణికావేశంలో మారిన ఆలోచనా శైలి కారణంగా ఈ ఘోర నేరంలో భాగస్వాములై చివరికి కేసులో ఇరుక్కోవాల్సి వచ్చిందని ఆ అధికారి వెల్లడించారు. సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, శాస్త్రీయ ఆధారాల ప్రాతిపదికగానే విచారణ సాగిందని ఆయన పేర్కొన్నారు.

# ఊకె శిరీషను హత్య చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలి

- సిఐటియు జిల్లా కోశాధికారి జిలకర పద్మ
- సిఐటియు ఆధ్వర్యంలో శిరీష కు నివాళులు అర్పించిన కార్మికులు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 2 , (ప్రజా జ్యోతి )** హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రి నందు నర్సుగా పనిచేస్తున్న కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల ప్రాంత నివాసి అయిన ఊకె శిరీషను హత్య చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కోశాధికారి పద్మ, పలువురు సిఐటియు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు, బుధవారం పాల్వంచ సిఐటియు పట్టణ కమిటి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శిరీష చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగ నివాళులర్పించి నిరసన తెలిపారు, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాది కారి జిలకర పద్మ , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ మహిళలకు రోజురోజుకు రక్షణ లేకుండా పోతుందన్నారు. పని ప్రాంతాల్లో పని చేస్తున్న శ్రామిక మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయకా పోవడం ఫలితంగానే ఇలాంటి సంఘటనలకు కారణమవుతున్నాయని ఆయన అన్నారు. అశ్లీల సాహిత్యానికి, వీడియోలకు బానిసలుగా మారి క్రూర మృగాల్లాగా వ్యవహరిస్తున్న దుండగుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు , పని ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కల్పించే విధంగా హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రభుత్వం, ఆసుపత్రి యాజమాన్యం బాధ్యత వహించి ఊకే శిరీష కుటుంబానికి తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు . ఊకె శిరీషను అతికిరాతకంగా అత్యాచారం, హత్య చేసిన సనముల్లా ఖాన్, , సంఘటనకు సహకరించిన వారందరినీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దుర్మార్గ సంఘటనలు రోజురోజుకీ పెచ్చు మీరుతున్నాయన్నారు. ఈ సంఘటనను పునరావృతం కాకుండా కఠినమైన చర్యలను తీసుకొని తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకురాలు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య. స్వచ మిత్ర నాయకురాలు నిహారిక ,వెంకట నర్సమ్మ, రమాదేవి ,అనురాధ , మీనాక్షి, శంకర్, చందు, రవి , ధర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రిలో చేరిన చిన్నారులను పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు





**కొత్తగూడెం కలెక్టరేట్ , )భద్రాచలం / సెప్టెంబర్ 2,ప్రజాజ్యోతి** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ లోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చెందిన కొంతమంది చిన్నారులు ఫుడ్ పాయిజన్ కారణంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, వారిని పరామర్శించారు.చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులకు మెరుగైన వైద్యం, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం చిన్నారుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే, మాట్లాడి చిన్న ఆరోగ్యం పట్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, రత్నం రమాకాంత్, చింతీరాల రవి కుమార్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి చిట్టిబాబు, పెద్దినేని శ్రీనివాస్, యండి జిందా, చాట్ల రవి, రసమళ్ల రాము, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.

## రేపు పాల్వంచ లో జరిగే బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కార్యక్రమానికి హాజరుకానున్న డా ;బాబు జగ్జీవన్ రామ్ మనవడు మాజీ లోక్సభ స్పీకర్ మీరా కుమారి కుమారుడు -అన్షుల్ అవిజిత్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 2 ,(ప్రజాజ్యోతి )** పాల్వంచ బస్టాండ్ సెంటర్లో నూతనంగా నిర్మించిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల నాల్గవ తేదీన చేపట్టినట్లు బాబు జగ్జీవన్ రామ్ ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షులు కాల్వ భాస్కర్ తెలిపారు, బుధవారం స్థానిక ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ మనవడు మాజీ లోక్ సభ స్పీకర్ మీరా కుమారి కుమారుడు డాక్టర్ అన్షుల్ అవిజిత్ నేషనల్ కాంగ్రెస్ ఏఐసీసీజాతీయ అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,,ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగస్థానిక కొత్తగూడెం శాసనసభ్యులు సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలుమాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపీలు. తదితరులు పాల్గొంటారని తెలిపారు , ఈనెల 4న శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కొత్తగూడెం నియోజకవర్గంలోని దళితులు, గిరిజనులు ,బీసీలు ,మైనార్టీలు నియోజకవర్గంలోని మేధావులు విద్యార్థులు ఉద్యమకారులు ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు, అనంతరం ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి ముద్రించిన బుక్ లెట్ ను ఆవిష్కరించారు, ఈ విలేకరుల సమావేశంలో ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి సోమయ్య,. అధ్యక్షులు దండోరా శ్రీను, కాల్వ ప్రకాష్, గోడ్ల మోహన్ రావు,,రాజేంద్ర కుమార్, బండి లక్ష్మణ్ ,రమేష్ రాథోడ్, వాసు మల్ల సుందర్రావు, గజ్జి శీను, మిరియాల వెంకటేశ్వర్లు, అలువాల సందీప్, సిరిపాక అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పి ఆర్ సి నీ ప్రకటించి పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పోరాటానికి మద్దతు తెలిపిన సిఐటియు




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 2,(ప్రజా జ్యోతి )** పిఆర్ సి ని ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన పోరాటాలకు సిఐటియు కొత్తగూడెం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జేఏసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన మహా ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హక్కుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉద్యోగులకు కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దుచేస్తుందని ,5సంవత్సారాలు ఎం పి – ఎం ఎల్ ఏ వుంటే లక్షరూపాయాల వేతనాలు పెన్షన్ సౌకర్యాలు పొందుతున్నారని, 40సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులు కార్మికులకు మాత్రం పెన్షన్ పొందే హక్కులేకుండా చట్టం చేశారని విమర్శించారు. ఈ హెచ్ ఎస్ ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జేఏసీ చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు, ఉపాధ్యాయ సంఘాల పోరాటంలో సిఐటియు ప్రత్యక్షంగా భాగస్వామి అవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ ,జిల్లా సహాయ కార్యదర్శి కె. సత్య ,డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలనీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు, బ్యాగుల పంపిణీ

- పలు పాఠశాలల్లో పంపిణీ చేసిన అధికారులు, ఉపాధ్యాయులు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని శాంతినగర్, గుంపెన (రజబ్ అలీ నగర్), రాజపురం, కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల, వెంకటాపురం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు, స్కూల్ బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు.శాంతినగర్ పాఠశాలలో పెద్దిరెడ్డిగూడెం ఉప సర్పంచ్ వేముల నరేష్, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఆచన వెంకటకృష్ణ విద్యార్థులకు బూట్లు అందజేశారు. రజబ్ అలీ నగర్ ప్రాథమిక పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చంద్రుగొండ ఫీల్డ్ ఆఫీసర్ రాజీవ్, మండల విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయులు భూక్యా బాబూలాల్ బూట్లు, బ్యాగులు అందజేశారు. రాజపురం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్, కస్తూరిబా పాఠశాలలో ప్రత్యేక అధికారి శారద, వెంకటాపురం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు బూట్లు, బ్యాగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు ప్రభుత్వం బూట్లు అందించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. వారం రోజుల్లోగా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు బూట్లు, బ్యాగులు అందజేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు కూలీల సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం



**ఆళ్ళపల్లి. సెప్టెంబర్2(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో కొమరం సత్యనారాయణ అధ్యక్షతన అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఏనుగు చంద్రారెడ్డి (సాగర్) మాట్లాడుతూ సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఆళ్ళపల్లి మండలం నుంచి 12 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఖమ్మంలో నిర్వహించే మహాసభకు మండల కేంద్రం నుంచి సుమారు 300 మంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలకు సంఘం సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పూనెం రంగయ్య, ఉపాధ్యక్షులు మెస్సు గోపాల్, గొగ్గల బొజ్జయ్య, కార్యదర్శి నాగబోయిన రాంబాబు, గొగ్గెల గాదాలు, బొమ్మర్ల వీరన్న, పూనెం లక్ష్మణ్, పూనెం బతకయ్య, పూనెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

- వై యస్ఆర్ ప్రజా హృదయాల్లో చిరుస్తాయిగా నిలిచిన నేత
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వసం శ్రీకాంత్



**ఆళ్ళపల్లి సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)** దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైయస్ ఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్ డాక్టర్ వైఎస్ ఆర్ సేవలను కొనియాడుతూ,వైఎస్ఆర్ ఒక వ్యక్తి కాదు... ఒక శకం అని పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, 108, 104, జలయజ్ఞం లాంటి ఎన్నో పథకాలతో తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని. ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీనే ముందుకు తీసుకెళ్లిందని అన్నార ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో రైతుల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేశారని తెలిపారు. నేటి యువతకు వైఎస్ఆర్ ఆదర్శప్రాయుడని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసం సుష్మిత యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీ నాథ్ ఆత్మ కమిటీ బి రవి సీనియర్ నాయకులు కరకపల్లి సుధాకర్ ఉల్లోజు భరత్ ముప్పారపు రాము జనగం సాయి చీమల శేఖర్ మంద సాయిరాజ్ శ్రీరామ్ సంపత్ పాయం సత్యనారాయణ. రాయపాడు సర్పంచ్ చిన్న పాప య్య.ఇర్ప నాగేష్ పాయం సూరయ్య రెడ్డి మల్ల రాజు తులం ముత్తిలింగం తు లం శ్రీను వల్లాల నాగేశ్వరరావు బూరుగడ్డ నాగేష్ బూరుగడ్డ కృష్ణ మహిళా నాయకురాలు పానుగంటి మంగ పద్మ రాంబాయి చేరుకుమంగా తదితరులు పాల్గొన్నారు.

# కారు డిక్కీలో 20 లక్షల 'మత్తు' గుట్టు రట్టు!

- భార్యాభర్తల గంజాయి దందా బస్ట్.. అశ్వాపురం లో భారీ పట్టివేత...
- అశ్వాపురం పోలీసుల సూపర్ స్ట్రైక్..40 కిలోల గంజాయి సీజ్...
- టాటా నెక్సాన్ లో గంజాయి..దంపతులు అరెస్ట్.
- ఒడిశా నుండి షిర్డీకి..దారి మధ్యలో అడ్డంగా బుక్కయిన గంజాయి స్మగ్లర్లు.!




భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ ప్రతినిధి, సెప్టెంబర్ 02 (ప్రజాజ్యోతి): జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బుధవారం అశ్వాపురం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవా రం గొల్లగూడెం శివారులోని సీతా రాం కెనాల్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓడి 30 ఈ 0342 నంబర్ గల టాటా నెక్సాన్ కా రును ఆపి సోదా చేయగా వెనుక డిక్కీ లో గుట్టలుగా దాచిన 40 కిలోల 560 గ్రాముల గంజాయి బయటపడింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన అరబిందో బిశ్వాస్,అతని భార్య సుప్రియ బిశ్వాస్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశాలోని కలిమెల నుంచి గంజాయిని తీసుకుని మహారాష్ట్రలోని షిర్డీకి తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిసింది.భార్యాభర్తల ముసుగులో గంజాయి రవాణా చేస్తుండటం గమనార్హం.ఈ ఘటనపై అశ్వాపురం ఇన్ స్పెక్టర్ ఎల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న ప్రధాన నెట్ వర్క్ పై దర్యాప్తు కొనసాగుతోందని, యువత భవిష్యత్తు ను నాశనం చేసే మత్తు పదార్థాలకు ఎవరూ బలికావద్దని సూచించారు.గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వెయ్యి రోజుల పాలనపై టీఆర్ఎస్ గళం!

- నిరసన దీక్షలోనూ వర్గ విభేదాల రచ్చ..?
- అశ్వరావుపేటలో 'మచ్చ వర్సెస్ తాటి' వర్గాలుగా విడిపోయి ధర్నా!
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటమా... లేక అంతర్గత ఆధిపత్య పోరా..?




**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 2 అశ్వరావుపేట :** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష అశ్వరావుపేటలో రాజకీయ చర్చకు దారితీసింది. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఐక్యంగా పోరాడాల్సిన సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్గాలుగా విడిపోయి ధర్నా నిర్వహించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ, స్థానికంగా టీఆర్ఎస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 'మచ్చ వర్గం – తాటి వర్గం'గా నాయకులు, కార్యకర్తలు విడిపోయి తమ తమ బలాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశారన్న ప్రచారం వినిపిస్తోంది.ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై



పోరాటం చేస్తామని పార్టీ శ్రేణులు చెబుతుండగా, మరోవైపు అదే వేదికపై వర్గ రాజకీయాలు బయటపడటం కార్యకర్తలను అయోమయంలోకి నెట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాల్సిన నాయకత్వం... వ్యక్తిగత ఆధిపత్యం కోసం వేర్వేరు శిబిరాలుగా మారిపోయింది ప్రతిపక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో టీఆర్ఎస్ నాయకత్వం ముందుగా అంతర్గత విభేదాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకే పార్టీ... ఒకే లక్ష్యం అంటూ నినాదాలు చేస్తున్నా, నేలస్థాయిలో మాత్రం వర్గాల మధ్య విభేదాలు కొనసాగితే పార్టీకి రాజకీయంగా నష్టం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్ష అసలు ప్రభుత్వంపై పోరాటానికా? లేక అశ్వరావుపేటలో ఎవరి వర్గం బలమైనదో నిరూపించుకునే వేదికగా మారిందా? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.బాక్స్ : ఐక్యత ఎక్కడ?కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడేందుకు నిర్వహించిన నిరసన కార్యక్రమంలోనే వర్గ విభేదాలు స్పష్టంగా కనిపించాయన్న చర్చ సాగుతోంది. పార్టీ అధిష్ఠానం ఈ పరిస్థితిపై దృష్టి సారించి నాయకుల మధ్య సమన్వయం తీసుకువస్తుందా? లేక వర్గ పోరు మరింత ముదురుతుందా? వేచి చూడాలి.ప్రజా జ్యోతి ప్రశ్నలుకాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కోసం నిర్వహించిన దీక్షలో వర్గాలుగా ఎందుకు విడిపోయారు?మచ్చ వర్గం, తాటి వర్గం అంటూ జరుగుతున్న ప్రచారంలో ఈరోజు జరిగిన పరిణామం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది పార్టీ ఐక్యత కోసం జిల్లా, రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకుంటుందా?ప్రజా సమస్యలపై పోరాటం కంటే అంతర్గత ఆధిపత్య పోరు ముఖ్యమైందా? రానున్న రోజుల్లో ఈ వర్గ విభేదాలు పార్టీపై ఎలాంటి ప్రభావం చూపనున్నాయి?

# వైఎస్సార్ కు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఘన నివాళి

**కొత్తగూడెం కలెక్టరేట్ ,భద్రాచలం /సెప్టెంబర్ 2,(ప్రజా జ్యోతి)** భద్రాచలం పాత మార్కెట్ లోని వైఎస్సార్ విగ్రహం వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావువైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర, పేదలు , బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన అమలు చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చిరస్మరణీయమని అన్నారు.వైఎస్సార్ అందించిన సంక్షేమ పాలన ప్రజా ప్రభుత్వానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూణెం కృష్ణ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి శ్రీనివాస్ లతోపాటుపార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, రత్నం రమాకాంత్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతీరాల రవి కుమార్, చింతాడి చిట్టిబాబు, అడబాల వెంకటేశ్వర్లు, MD జిందా, చాట్ల రవి, శీలం రామ్మోహన్ రెడ్డి, రసమళ్ల రాము, బసవరాజు, 15వ వార్డు సభ్యులు సున్నం ఈశ్వరి, 18వ వార్డు సభ్యులు జగ్గా కుమారి, సరిత, బత్తుల సాంబయ్య, గానుగ రమణ, ఆదినారాయణ, జగ్గా పుల్లయ్య, బంధం శ్రీనివాస్, మాధవరావు, ఎస్.ఎస్. రావు, బి.వి.ఆర్.ఆర్. సింగ్, నాయుడు, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రజా వైద్యం గాలికి... ఎమ్మెల్యే పట్టింపు ఏది?

- ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై మౌనం ఎందుకు?
- రోగుల అవస్థలు కనిపించడం లేదా... అధికారుల నిర్లక్ష్యంపై చర్యలేవి?




**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 2** అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజా వైద్యం పరిస్థితి రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆశ్రయంగా ఉండాల్సిన ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్య సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు ఉన్నాయంటూ ఫిర్యాదులు వస్తున్నా, ప్రజాప్రతినిధుల నుంచి స్పష్టమైన స్పందన కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజలు ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత ఉందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సకాలంలో సేవలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై సమీక్ష నిర్వహించాలని వారు కోరుతున్నారు.

**గెలిపించినందుకు తిప్పలు తప్పవా**

పేదలకు ప్రభుత్వ ఆసుపత్రే దిక్కు ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులను భరించలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రే ప్రధాన ఆధారం. అలాంటి చోట వైద్య సేవల్లో లోపాలు ఉంటే బాధితులు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో ప్రభుత్వం, వైద్యశాఖతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**సమస్యలు పరిష్కరించే చర్యలేవి?**

ఆసుపత్రి సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి, వాస్తవ పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతోంది. అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, అత్యవసర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? రోగులకు సమయానికి వైద్యం అందుతోందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజల ప్రశ్నలు ఇవే**

ప్రజా వైద్యం గాలికి వదిలేస్తే పేదల పరిస్థితి ఏంటి?
ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లలేదా?
తెలిసినా స్పందించడం లేదా?
ఆసుపత్రిపై ప్రత్యేక సమీక్ష ఎప్పుడు?
బాధ్యులపై చర్యలు ఎప్పుడు?

**ప్రజల డిమాండ్**

**"ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలి... రోగులతో మాట్లాడాలి... సమస్యలను గుర్తించాలి... వైద్య సేవలను మెరుగుపరచాలి" అంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.**

**ప్రజా ఆరోగ్యం రాజకీయాలకు అతీతం. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయడం అందరి బాధ్యత. ఇకనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆసుపత్రి పరిస్థితిపై స్పష్టమైన చర్యలు తీసుకుంటారా? లేక ప్రజా వైద్యం సమస్యలు ఇలాగే గాలికి వదిలేస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది.**

## వైఎస్సార్‌కు ఘన నివాళులు



**చర్ల, సెప్టెంబర్ 02: (ప్రజాజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజ య్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారు మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అ న్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కుంజా చంటి, మెడబత్తిన వాసు, ఎస్సీ సెల్ చర్ల మండల అధ్యక్షుడు మచ్చ రాజా, పూజారి రమణయ్య, మునిగేలా వెంకన్న, గూడపాటి రంజిత్, చెన్నం పవన్, పాలెం నవీన్ కుమార్, కాయం శ్రీను, కేదారి వంశీ, బొల్లా వినోద్, పరవా శంకర్, సున్నం గంగరాజు, గడ్డం నాగరాజు, పోగల్ల సత్తిబాబు, సిద్ది సత్యనాధం, రజినీకాంత్, నాగరాజు, సుధాకర్, బిక్షపతి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిరీష మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి



**చర్ల, సెప్టెంబర్ 02: (ప్రజాజ్యోతి):** హైదరాబాద్ తుక్కుగూడలో ఇటీవల మృతి చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె మృతికి కారణమైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చర్ల హిందూ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తుడుందెబ్బ, గోండ్వానా సంక్షేమ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 48 గంటల రిలే నిరాహార దీక్షలకు చర్ల హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక సభ్యులు మాట్లాడుతూ ఉయిక శిరీషపై జరిగిన ఘటన అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం, పోలీసు, న్యాయ వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన శిక్షలు అమలు చేయడంతో పాటు మహిళలు, ఆదివాసీ యువతుల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.తండ్రి లేని ఆదివాసీ యువతి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ కుటుంబాన్ని పోషించేందుకు దూర ప్రాంతానికి వెళ్లి వైద్యశాఖలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తుండగా ఈ దారుణ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.శిరీషకు న్యాయం జరిగే వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హిందూ ఐక్య వేదిక నాయకులు తెలిపారు. అలాగే శిరీష కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్ల గ్రామంలోని దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శేశెట్టి సాంభశివరావు, లింగమూర్తి, చర్ల మండల హిందూ ఐక్య వేదిక సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, వివిధ వ్యాపారస్తులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్‌కు తుళ్లూరి బ్రహ్మయ్య అభినందనలు



**అశ్వాపురం, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి**అశ్వాపురం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన నవచైతన్య ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు బుధవారం తుళ్లూరి బ్రహ్మయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ హితం కోసం పనిచేస్తూ వాస్తవాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. వార్తల విషయంలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరిని పాటించాలని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టుల పాత్ర ప్రస్తుత సమాజంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.నూతనంగా ఏర్పడిన నవచైతన్య ప్రెస్ క్లబ్‌కు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బ్రహ్మయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ సలహాదారు తునికేసి సురేందర్ రెడ్డి, కోశాధికారి ఎస్కే ఖదీర్, ఉపాధ్యక్షులు కత్తెరం వెంకటరమణారెడ్డి, పగడాల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి గరికపాటి అంజన్ రావు, మండల విజయ్ కుమార్, కానూరి రాంబాబు, అలవాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన 48 గంటల రిలే దీక్షలు



**చర్ల, సెప్టెంబర్ 02: (ప్రజాజ్యోతి):** ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం చర్ల మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వద్ద సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించిన 48 గంటల రిలే నిరాహార దీక్షలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చర్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్లపై ఉందన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 3 స్థానంలో కొత్త జీవో తీసుకువచ్చి అసెంబ్లీలో చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయ ఖాళీలను ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, భద్రాచలం కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థుల కోసం న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కింద దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ప్రభుత్వ భూములకు 1/70 చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరులకు లక్షల రూపాయల నష్టపరిహారం పంపిణీ చేసిన అంశంపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.48 గంటల రిలే దీక్షలకు వివిధ ప్రజా సంఘాలు, మేధావులు, పట్టణ ప్రముఖులు, వ్యాపారవర్గాలు, ఆదివాసీ సంఘాలు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపాయని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బీ. రబోయిన శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీరబోయిన అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, మండల అధ్యక్షుడు ఇరుప అంజిబాబు, మండల కార్యదర్శి కాయం శ్రీనివాసరావు, సున్నం సుబ్బయ్య, పాయం సన్యాసి, యాలం నరసింహారావు, కారం సుధ, కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత నేత వైఎస్సార్

- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు.

**పాల్వంచ, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి:** పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా పాల్వంచ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్వంచ బీసీఎం రోడ్డులోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కొత్వాల శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ, రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌దేనని అన్నారు.వైఎస్సార్ పాలనలో పేదలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందాయని పేర్కొన్నారు. ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ భాస్కర్‌రావు, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్నగౌడ్, పైడిపల్లి మహేష్, సాదం రామకృష్ణారావు, ఎస్.వి.ఆర్.కె. ఆచార్యులు, కొత్తపల్లి సోమయ్య, కాపర్తి వెంకటాచారి, డిష్ నాగేశ్వరరావు, కటుకూరి శేఖర్, కోమట్రాజు విజయ్, వజ్జల రాము, వాలపల్లి రాంబాబు, సందు ప్రభాకర్, పాకాలపాటి రోశయ్య చౌదరి, చెన్నూరు రాము, కొత్తపల్లి రవి, బొందిల బాలు, బూసి శ్రీను, యాటా నాని, కొండూరి లక్ష్మణ్, సాగర్, ధర్మరాజుల రమేష్, సంతోష్, దాసరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 5న ఇల్లందులో జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి పర్యటన

- జనసేనలో భారీ సంఖ్యలో చేరనున్న పవన్ కళ్యాణ్ అభిమానులు



**ఇల్లందు, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి)**సెప్టెంబర్ 5న ఇల్లందులో జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు పర్యటన ఉంటుందని జనసేన పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకురాలు నాగ స్రవంతి అన్నారు. బుధవారం స్థానిక సిఎస్పి బస్తీ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తాను భారతీయ జనతా పార్టీ అభ్యర్థినిగా పోటీ చేశానని, తన వ్యక్తిగత కారణాల వల్ల కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నానని, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏపీలో చేపట్టిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ఆకర్షితురాలై, ఆగస్టు 8న ఆయన సమక్షంలో జనసేన పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నేను ఏజెన్సీ ప్రాంతమైన మీరియాలపెంట గ్రామంలోని పాఠశాల, ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిదంగా జనసేన పార్టీలోకి భారీ సంఖ్యలో పవన్ కళ్యాణ్ అభిమానులు చేరనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ ఐదున ఇల్లందు నియోజకవర్గంలో జరిగే కార్యక్రమానికి జనసైనికులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మద్ది సాయి కుమార్, జన్ను రావీష్, శ్రావణ్ కుమార్, ముత్యాల వీరబ్రహ్మం, యాకుబ్, హేమంత్, పాయం శాంతిరాజ్, శ్రావణి, హైమావతి, మధు, కురాకుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల నిత్య కళ్యాణం



**భద్రాచలం సెప్టెంబర్ 2,(ప్రజా జ్యోతి)** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిత్య కళ్యాణ వేడుక బుధవారం నేత్ర నేత్ర పర్వంగా జరిగింది, భద్రాచలంలోని మిథిలా స్టేడియం వద్ద ఏర్పా టు చేసిన నిత్య కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు క్షత్రువును వైభవంగా నిర్వహించారు, ఈ కళ్యాణా న్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ని దర్శించుకున్నారు, భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

## బీఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ

- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన



**చర్ల, సెప్టెంబర్ 02:(ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం చర్ల నుంచి భద్రాచలం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సుమారు 200 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. పార్టీ శ్రేణులు గులాబీ జెండాలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఆసరా పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన తెలిపారు. అనంతరం ర్యాలీ చర్ల నుంచి భద్రాచలం వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బి ఆర్ ఎస్ భారీ ర్యాలీ

- కాంగ్రెస్ 6 హామీలపై ప్రభుత్వాన్ని ఎండగట్టిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



**ఇల్లందు, సెప్టెంబర్ 02 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు నిర్లక్ష్యంపై బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట తారక రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల-విఫల పాలనపై వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సమరభేరి- కార్యక్రమాలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మొదటి రోజు బుధవారం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ఇల్లందులో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణ ప్రధాన రోడ్ల వెంట భారీ నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కడం కోసం ప్రతి ఇంటికి గ్యారెంటీ కార్డులను పంచుతూ 6 గ్యారంటీలను 420 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, ఆరు గ్యారెంటీల పేర్లతో బాండ్ పేపర్లు రాసిచ్చి 100 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రజలను నమ్మబలికి వెయ్యి రోజులు గడుస్తున్న ఆ హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు ఎన్నో కానీ అమలు మాత్రం శూన్యం అని ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి తీర అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలపై నిర్లక్ష్యం వహించిందన్నారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ, రైతు భరోసా ఏమైందని, కళ్యాణ లక్ష్మి తులం బంగారం ఏమైందని.. రైతు కూలీలకు ఇస్తానన్నరూ. 12 వేల ఏమయ్యాయని.. మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రూ. 500కు గ్యాస్ సిలిండర్ ఎక్కడ.. యువతకు ఇచ్చిన ఉద్యోగాల మాట ఏమైందని.. విద్యార్థులకు ఇస్తానన్న స్కూటీ ఏమైందని, ఫీజు రియంబర్స్ మెంట్ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఇప్పుడు ఎక్కడ కలిసిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలకు పంగనామాలు పెట్టి, 420 హామీలకు మంగళం పాడి ఈరోజు వెయ్యి రోజుల పాలన అని ఊరేగుతున్నారే తప్ప ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ది వెయ్యి రోజుల పాలన కాదని.. 1000 రోజుల ప్రజా పీడన అని దుయ్యబట్టారు. ప్రజలను నమ్మించి వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును గ్రామ గ్రామాన వీధి వీధిన ప్రజలు తిరస్కరిస్తున్నారని, రాబోయే కాలంలో ప్రజాక్షేత్రంలో కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆంగోతు బిందు, మున్సిపల్ కౌన్సిలర్లు దండు సారయ్య, పాబోలు స్వాతి, నాయకులు సిలివెరి సత్యనారాయణ, జెకె శ్రీను, లకావత్ దేవిలాల్ నాయక్, దాస్యం ప్రమోద్, బండారి శ్రీను, తాత గణేష్, రాధా కృష్ణ, శీలం శెట్టి రమేష్, బోడ బాలు నాయక్, కిషన్ నాయక్, రామ నాయక్, ఆంతోటి అచ్చయ్య, గిన్నారపు రాజేష్, సత్తాల హరి కృష్ణ, కాసాని హరి ప్రసాద్ యాదవ్, షేక్ చాంద్ పాషా, మహమ్మద్ యాకుబ్ పాషా, నీలం రాజశేఖర్, వార రమేష్, రఘు వీర్ రెడ్డి, నెమలి ధనలక్ష్మి, కటకం పద్మావతి, బాసాని రాములు, కొక్కు సరిత, కుంజ సతీష్, పింకీ లోదు, మిర్జా బేగా, మసూద్ రబ్, సామల రవి తేజ, తోట లలిత శారద, కడగండ్ల నారాయణమ్మ, వీరస్వామి, గండమల రామకృష్ణ, బర్మవత్ లాల్ సింగ్, సైదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోండ్వాన పరిషత్ దీక్షకు తుడుందెబ్బ మద్దతు

**చర్ల, సెప్టెంబర్ 02:(ప్రజా జ్యోతి):** గోండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల దీక్షకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం చర్ల మండల కేంద్రంలోని కొమరం భీమ్ సెంటర్ లోని తుడుందెబ్బ కార్యాలయంలో దీక్షకు మద్దతు తెలిపిన అనంతరం తుడుందెబ్బ సీనియర్ నాయకుడు తాటి రామకృష్ణ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ఏరియాలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఇది స్పష్టమవుతోందని అన్నారు. గిరిజనేతరుల కుట్రల కారణంగానే జీవో నంబర్ 3 రద్దయిందని, దీంతో ఆదివాసీ సమాజానికి తీరని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీల ప్రయోజనాలను కాపాడేలా ప్రత్యేక జీవో తీసుకురావడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.చర్ల మండల కేంద్రంలో గిరిజనేతరులు ప్రభుత్వ, గ్రామకంఠం భూములను అక్రమంగా ఆక్రమిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై తుడుందెబ్బ యువసైన్యాన్ని ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని తెలిపారు. చర్ల మండలంలో 1/70 చట్టం కింద



కేసులు ఎదుర్కొంటున్న గిరిజనేతరుల వివరాలను తెలుసుకుని, త్వరలో వారి ఆక్రమణల్లో ఉన్న భూముల్లో తుడుందెబ్బ జెండా పాతుతామని హెచ్చరించారు. ఇటీవల ఆదివాసీ మహిళ ఉయిక శిరీష మృతి పట్ల తాటి రామకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శిరీషలాంటి పరిస్థితి మరెవరికీ రాకుండా ప్రభుత్వం ఆమె పేరుతో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, ఆదివాసీ మహిళలు, యువత రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కారం నరేష్, పురిటి ప్రశాంత్, పూనెం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల కోటేశ్వరరావు మృతికి కొత్వాల సంతాపం



**పాల్వంచ, సెప్టెంబర్ 2, ప్రజాజ్యోతి:** పాత పాల్వంచ షిర్డీ సాయిబాబా దేవాలయ ధర్మకర్త, కెటిపిఎస్ గ్రేడ్-4 ఫోర్‌మెన్, 327 యూనియన్ నాయకులు ముత్యాల కోటేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు.పాతపాల్వంచలోని కోటేశ్వరరావు స్వగృహంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మృతి పట్ల వారు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.కోటేశ్వరరావు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, షిర్డీ సాయిబాబా దేవాలయ ధర్మకర్తగా సేవలందించారని వారు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి కార్మిక రంగానికి, దేవాలయ సేవలకు తీరని లోటని పేర్కొన్నారు.

## శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

- సీఐటీయూ, అంగన్వాడీ టీచర్ల నిరసన



**చర్ల, సెప్టెంబర్ 02:(ప్రజా జ్యోతి):** ఉయిక శిరీషపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో చర్ల బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ ప్రాజెక్ట్ సెక్టార్ అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ ఉయిక శిరీషపై జరిగిన ఘటన తీవ్రంగా కలచివేసిందని అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుజాత, పద్మావతి, ఎం. జ్యోత్స్న, పి. విజయలక్ష్మి, వై. సరిత, కే. లక్ష్మి, ఎం. నిర్మల, బి. కన్నమ్మ, సీపీఎం నాయకులు కారం నరేష్, నవీన్, రైతు సంఘం నాయకులు నల్లగట్ల మూర్తి, గొండ్వానా రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు, చర్ల ఇన్‌చార్జి తాటి రామకృష్ణ, ఇర్ప అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఎర్ర మట్టి దందా..!

- మాకు ఎదురు నిలిచేది ఎవరు..?
- రాత్రి.. పగలు తేడా లేదు..!
- అక్రమార్కుల జోరుకు అడ్డుకట్టేది ఎవరు..?





**అశ్వా రావుపేట సెప్టెంబర్ 2 ప్రజా జ్యోతి**

ఆశ్వా రావుపేట ప్రాంతంలో అక్రమ ఎర్ర మట్టి దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు, అనుమతులు, ప్రభుత్వ నిబంధనలన్నీ పక్కనపెట్టి కొందరు అక్రమార్కులు ఎర్ర మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఒక్కో ఎర్ర మట్టి ట్రిప్పుకు రూ.1,200 నుంచి రూ.1,800 వరకు ధర పలుకుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రోజుకు ఎన్ని ట్రిప్పులు..? వాటి ద్వారా ఎంత మొత్తం అక్రమంగా చేతులు మారుతోంది..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రాత్రి పగలు తేడా లేకుండా దందా..!**

ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు.. అవసరమైతే రాత్రి వేళల్లో కూడా ఎర్ర మట్టి తరలింపు జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా మట్టిని తరలిస్తూ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నర్సరీలే టార్గెట్..?**

ముఖ్యంగా నర్సరీల కోసం అంటూ ఎర్ర మట్టిని భారీగా తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా నర్సరీ అవసరాల కోసమే మట్టి తీసుకెళ్తున్నారా? లేక నర్సరీల పేరుతో అక్రమ వ్యాపారానికి తెరలేపారా? అన్నది అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

**అధికారులు ఎక్కడ..?**

అక్రమంగా మట్టి తరలింపు జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

అనుమతులు ఉన్నాయా..?
ఎంత మేరకు మట్టి తవ్వకాలకు అనుమతి ఉంది..?ఎక్కడి నుంచి మట్టి తరలిస్తున్నారు..?
ఎక్కడికి తరలిస్తున్నారు..?
రవాణాకు సరైన పత్రాలు ఉన్నాయా..?
ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది సంబంధిత అధికారులే.

**"అక్రమ ధనార్జనే లక్ష్యమా..?"**

ఒక్క ట్రిప్పుకు రూ.1,200 నుంచి రూ.1,800 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, రోజుకు పదుల సంఖ్యలో ట్రిప్పులు జరిగితే అక్రమార్కులకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంటే.. అక్రమార్కుల జేబులు మాత్రం నిండుతున్నాయా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల మౌనం ఎందుకు..?**

అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ర్వహిస్తున్నారా..? అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారా..? లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అన్న ప్రశ్నలకు సమాధానం కావాలని ప్రజలు కోరుతున్నారు.

## మావోయిస్టుల ఆయుధాల డంప్ గుర్తింపు

- భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, తూటాలు స్వాధీనం



**చర్ల ,సెప్టెంబర్ 02: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక, భద్రతా చర్యల్లో బీజాపూర్ పోలీసులు కీలక విజయం సాధించారు. భోపాల్‌పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలమడగు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నదీతీరం వెంబడి నిర్వహించిన గాలింపు చర్యల్లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సంయుక్త పోలీసు బృందం స్వాధీనం చేసుకుంది.పోలీసుల సమాచారం ప్రకారం సెప్టెంబర్ 1న నీలమడగు గ్రామ అటవీ ప్రాంతంలోని నదీతీరం సమీపంలో అనుమానాస్పద వస్తువులు దాచినట్లు భోపాల్‌పట్నం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంయుక్త భద్రతా బృందం రంగంలోకి దిగి అటవీ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చేపట్టింది. ఈ సందర్భంగా నదీతీరంలో నరికివేసిన ఓ చెట్టు తొర్రలో దాచిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి నిల్వను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక 12 బోర్ నాటు తుపాకీ, విరిగిన ఒక బీజీఎల్ రైఫిల్, 8 బీజీఎల్ సెల్స్, 12 బోర్ నాటు తుపాకీకి చెందిన 10 సజీవ తూటాలు, 3 నాటు తుపాకీ సెల్ క్యాప్‌లు, ఒక ప్లాస్, ఒక బ్యాక్‌ప్యాక్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆయుధాలు, మందుగుండు సామగ్రికి నక్సలైట్ కార్యకలాపాలతో సంబంధం ఉన్నట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిని పోలీసులు చట్ట ప్రకారం జప్తు చేసి, వాటిని ఎవరు, ఏ ఉద్దేశంతో అడవిలో దాచారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు అని అధికారులు అన్నారు.ఈ ఆపరేషన్ బీజాపూర్ ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా మార్గదర్శకత్వంలో నిర్వహించగా భోపాల్‌పట్నం ఎస్‌డీఓపీ ఘనశ్యామ్ కామ్దే, భోపాల్‌పట్నం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ముఖేష్ పటేల్, బీజాపూర్ డీఆర్‌జీ, బీడీఎస్ బృందాలు, భోపాల్‌పట్నం పోలీసులు కీలకంగా వ్యవహరించారు.జిల్లాలో నక్సల్ వ్యతిరేక చర్యల్లో భాగంగా అడవులు, సున్నిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నాయి అని నీలమడగు అటవీ ప్రాంతంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకోవడం భద్రతా దళాలకు కీలక విజయంగా పోలీసులు అన్నారు. ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి అని అధికారులు తెలియచేసారు.

## బాధితులు బయటకు రండి బీజేపీ అండగా ఉంటుంది

- ఉద్యోగాల కుంభకోణంపై బాధితులతో కలిసి డీజీపీని కలుస్తాం కుంజా ధర్మా

**కొత్తగూడెం కలెక్టరేట్ ,భద్రాచలం /సెప్టెంబర్ 2,(ప్రజా జ్యోతి)** దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెల్లం హరికృష్ణ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు వస్తున్న వ్యవహారం పై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పీఏ కళ్యాణ్‌కు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యవహారం ద్వారా భద్రాచలం నియోజకవర్గానికి చెందిన మరికొందరు కాంగ్రెస్ నాయకుల ప్రమేయంపై కూడా తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయని ,మొత్తం వ్యవహారం రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ఉండొచ్చన్న సమాచారం ఉందన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితులు ధైర్యంగా బయటకు రావాలని కుంజా ధర్మా పిలుపునిచ్చారు. బాధితులతో కలిసి తెలంగాణ డీజీపీని స్వయంగా కలిసి సమగ్ర విచారణకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అవసరమైతే కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహకారంతో ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.బాధితుల్లో ఆదివాసీలు ఉంటే జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా న్యాయం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని,జరిగిన అన్యాయంపై ఆధారాలతో ముందుకు వస్తే బీజేపీ అండగా నిలుస్తుందని కుంజా ధర్మా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, పీసీ కేశవ్, గుమ్మల్ల వెంకటేశ్వర్లు (జీవా), బోడ సత్యనారాయణ, జంపాల ప్రభాకర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ





**పాల్వంచ, సెప్టెంబర్ 2, ప్రజా జ్యోతి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పాల్వంచలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పాల్వంచ ఇందిరా కాలనీలోని బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు చేతుల మీదుగా రోగులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు ఖాసీం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు పాల్వంచ జనసేన పార్టీ కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల అధ్యక్షులు దేవాగౌడ్, టౌన్ ప్రెసిడెంట్ బ్రహ్మం, పవన్ కళ్యాణ్ వీరాభిమాని సింహాచలం, ముత్తినేని శ్రీను, మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు ఖాసీం, సాంబ, సంపత్, రామ్‌వర్మ, గురుసాయి శ్రావణ్, సాయి తేజ, ప్రసాద్, వీరమహిళ సరోజిని, రమేష్, బాలాజీ, మీరావలి భాషా, మీరా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- తాళ్లూరి పవన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు తాళ్లూరి పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులపై అవగాహన కల్పించాలి



**ములకలపల్లి, సెప్టెంబర్ 02 (ప్రజాజ్యోతి):** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందుతున్న నోటీసులపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అవగాహన కల్పించాలని ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్ సూచించారు. నోటీసుల్లో పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, వయస్సు, చిరునామా తదితర వివరాలను ఓటర్లు పరిశీలించుకోవాలన్నారు. తప్పులు ఉంటే సంబంధిత బీఎల్ఏలు, బీఎల్ఓలను సంప్రదించి అవసరమైన పత్రాలతో సరిచేయించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జహీరుద్దీన్, బీఎల్ఏల సూపర్‌వైజర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కరటూరు కృష్ణరత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిరీష కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి

- నిందితుడికి ఉరిశిక్ష విధించాలి: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్



హైదరాబాద్:ఆదివాసీ యువతి మృతికి కారణమైన నిందితులను ఉరిశిక్ష వేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చోటిగూడెం గ్రామంలో ని శిరీష స్వగృహానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శిరీష చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ శిరీష ఘటనకు కారణమైన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నివసిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన వారిపై ప్రభుత్వం నిఘాను పెంచాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం అందించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. బాధితుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని నరాటి ప్రసాద్ ప్రకటించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి ఉపసర్పంచ్ పువ్వాల లాలితారావు, ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి న్యాయవాది ఊకె రవి, సిపిఐ మండల కార్యదర్శి ఎండి యూసఫ్, సహాయ కార్యదర్శి నరాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసానికి వెయ్యి రోజులు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 2, (ప్రజా జ్యోతి)** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం 1000రోజుల మోసం పై ధర్నా నిర్వహించి 420 హామీలు మోసపోయి 420 అడుగుల ఫ్లెక్సీ లో ఉన్న ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా గద్దకెక్కిన సీఎం రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బి ఆర్ ఎస్ నవతన్, అనుదీప్, యువ నాయకులు వాసు మల్ల గౌతం , సుధీర్, ముత్యాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# వైద్యులు లేని ఆసుపత్రి.. రోగులకు తప్పని అవస్థలు

- ఎంబీబీఎస్ వైద్యుడు లేకుండానే వైద్య సేవలు..
- దోమల బెడదతో పేషెంట్ల ఇబ్బందులు
- శుభ్రత లేని మరుగు దొడ్లు
- అరణ్యాన్ని తలపిస్తున్న ఆసుపత్రి ఆవరణ
- వీధిలైట్లు లేక విలవిల అంటున్న ఆసుపత్రి వీధి




**అశ్వాపురం, సెప్టెంబర్ 2,ప్రజాజ్యోతి**

అశ్వాపురం:మండల ప్రజలకు ప్రధాన వైద్య ఆధారంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత, పారిశుద్ధ్య లోపాలు, సమయపాలన సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం ఈ ఆసుపత్రిపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారిందని వారు పేర్కొంటున్నారు.

ఆసుపత్రిలో ఎంబీబీఎస్ వైద్యుడు అందుబాటులో ఉండాల్సిన సమయంలో వైద్య సేవలు ఇతర విభాగాలకు చెందిన వైద్యులు, ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సాధారణ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ప్రధానంగా పిల్లల్లో ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి వైద్య సేవలకు అనుసంధానం చేయడానికి ఉద్దేశించినదని అధికారిక సమాచారం చెబుతోంది.

మరోవైపు ఆసుపత్రి పరిసరాలు అరణ్యాన్ని తలపించేలా మారాయని, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు దోమల బెడద అధికంగా ఉందని రోగులు చెబుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే ప్రజలు దోమల కారణంగా మరింత ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

అశ్వాపురం మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రితో పాటు సబ్ సెంటర్లు ఉన్న ప్రతిచోట అక్కడ కూడా సిబ్బంది సమయపాలనపై ఫిర్యాదులు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజలకు నిర్ణీత సమయంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండలంలో ఒక ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిపైనే అనేక గ్రామాల ప్రజలు ఆధారపడుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్య పరిస్థితి ఏర్పడితే పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు తక్షణ సేవలు అందకపోతే దూర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ వైద్యుడిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య సిబ్బంది హాజరు, సమయపాలనను పర్యవేక్షించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే సబ్ సెంటర్లలోనూ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

- మండలంలోని పలు గ్రామాల్లోనూ వైఎస్సార్ కు ఘన నివాళులు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 2 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పర్స వెంకట్ మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైఎస్సార్ అని అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో కూడా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం మాజీ వైస్ చైర్మన్ గుజ్జ పూర్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల వెంకట్రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనపనూరి జమలయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బాలసాని శ్రీను, వడ్డెబోయిన చెన్నారావు, ఎం.లాలు, సిద్దెల నవీన్, అమరబాదు శ్రీను, పలగాని రామారావు, సవలం కృష్ణ, తేజావత్ రంగ, బదుగు సతీష్, ఇనపనూరి పెద్దులు, సిద్దెల రాఘవులు, సంగసాని నాగేష్, కాంపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

## వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యం

- రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ధ్యేయం
- బత్తుల అంజి, ఎండీ జహీర్
- 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**ములకలపల్లి, సెప్టెంబర్02 (ప్రజాజ్యోతి):** వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి, ములకలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జహీరుద్దీన్ అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా రామచంద్రాపురంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు సంక్షేమం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. వైఎస్సార్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పెటెటి నరసింహారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పాలకుర్తి రత్నభూషణం, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు అచెన వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్నం సుధాకర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు గాడి తిరుపతిరెడ్డి, ఎస్ ఐఆర్ మండల కోఆర్డినేటర్ సురభి రాజేష్, మాజీ సర్పంచులు కారం సుధీర్, సున్నం రాంమోహన్, కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.